క్లుప్తంగా

నేతలకు కార్యకర్తలే అండ



రామశింగవరంలో కామిరెడ్డి నానిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పెదవేగి: నాయకులకు కార్యకర్తలే అండగా నిలిచి ఆదుకున్నారని ఏలూరు జిల్లా యువ జన విభాగ అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. సోమవారం పెదవేగి మండలం రామశింగవరంలో కామిరెడ్డి నానిని ఏలూరు జిల్లా జేసీఎస్ కన్వీనర్ శివరావు, ఏలూరు జిల్లా ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ భూక్య మురళీ నాయక్, ఘంటా పండు, ఇతర నాయకులు, కార్యకర్తలు పరామర్శించారు.

టైం లైన్ ప్రకారం రీసర్వే



రీసర్వేపై సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సుమతి

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు టైం లైన్ ప్రకారం గ్రామాల్లో రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం రీసర్వే మండల డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్వోలు, సర్వేయర్లతో రీ సర్వేపై సమావేశం నిర్వహించారు. కొత్తగా రైస్ కార్డు ఇళ్ల స్థలాలకు మంజూరు కోసం దరఖాస్తులు చేసుకునేలా గ్రామాల్లో సమాచారం తెలియజేయాలని తహసీల్దార్ సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర, మండల సర్వేయర్ రమణారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

హెపటైటిస్‌ను నిర్లక్ష్యం చేస్తే లివర్ క్యాన్సర్



హెపటైటిస్‌పై అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

దెందులూరు: హెపటైటిస్‌ను నిర్లక్ష్యంచేస్తే లివర్ క్యాన్సర్ సిరోసిస్‌కు దారి తీస్తుందని నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గెట్టి నూకరాజు అన్నారు. సోమవారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో హెపటైటిస్ దినోత్సవ సందర్భంగా నర్సింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. వైరల్ ఇన్ఫెక్షన్ వలన ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుందని లివర్ క్యాన్సర్ సిరోసిస్ వస్తే మూడు రోజులు వ్యాక్సిన్ తప్పకుండా ఇవ్వాలన్నారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులు కాలేయ నమూనాను ప్రదర్శన చేశారు. నర్సింగ్ సీనియర్ విద్యార్థిని బిందు మాధవి మాట్లాడుతూ టీం లెట్స్ బ్రేక్ ఇట్ డౌన్ నినాదాన్ని ప్రకటించారు.

వన సంరక్షణ సమితిని పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): కామవరపుకోట మండలం కొండగూడెం వన సంరక్షణ సమితిని పునరుద్ధరించాలని, కొండగూడెం అడవి బంజరులో పేదలు పెంచిన మొక్కలను ఫారెస్ట్ గార్డు నరకడాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా అటవీ శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. దీనిపై డీఎఫ్ఓ సతీష్ స్పందిస్తూ మొక్కలను నరకకుండా చర్యలు చేపడతామని, వీఎస్ఎస్ ఉంటే దాన్ని సక్రమంగా పనిచేసేలాగా చేస్తామని, వీఎస్ఎస్ రికార్డులలో లేకపోతే కొత్త వీఎస్ఎస్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని సీపీఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య తదితరులు తెలిపారు.

శ్మశానంలో సమస్యల తిష్ట

- కనీసం నీరు, దారి లేక ప్రజల ఇక్కట్లు
- కోళ్ల వ్యర్థాలు, జంతు కళేబరాలతో నిండిన శ్మశాన వాటిక
- దుర్గంధంతో రైతులు, ప్రజల అవస్థలు వర్ణనాతీతం



అధ్వానంగా ఉన్న భీమడోలు శ్మశాన వాటిక



అంతిమ సంస్కారాల్లో ముక్కు మూసుకొని పాల్గొన్న జనం (ఫైల్)

భీమడోలు: శ్మశాన వాటికలో కనీస వసతులు కరవై, సమస్యలు తిష్ట వేయడంతో ఆఖరి మజిలీలో అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. దీనితో భీమడోలులోని మరుభూమికి వెళ్లాలంటే ప్రజలు భీతిల్లిపోతున్నారు. శ్మశాన స్థలంలో కోళ్ల వ్యర్థాలను పూడ్చడం, జంతు కబేళా ఉండడంతో వాటి నుంచి వచ్చే దుర్వాసనతో అంతిమ సంస్కారాలకు హాజరయ్యే వారి ముక్కుపుటాలు దుర్గంధంతో అదిరిపోతున్నాయి. అక్కడకు వెళితే అనారోగ్యం వెంట తెచ్చుకున్నట్లేనని పలువురు అంటున్నారు. వాటిని పూర్తి స్థాయిలో పూడ్చకుండా వదిలి వేయడంతో ఆ వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన ప్రాణాలు పోయేంతగా వస్తుంది. దీంతో శ్మశాన వాటికకు వెళ్లాలంటేనే నరకయాతనను అనుభవిస్తున్నారు. భూలోక కైలాసంగా భావించే అఖరి మజిలీలో పవిత్రంగా ఉన్న దహన కార్యక్రమాలు, ఖనన కార్యక్రమాలు సైతం అక్కడ సంతృప్తిగా జరిగే పరిస్థితులు కనిపించడం లేదు.

శ్మశాన వాటిక స్థలాన్ని వదలని అక్రమార్కులు

మేజర్ పంచాయతీ భీమడోలులోనే అనేక కులాలున్నాయి. సుమారు 30 వేల మంది జనాభా పైగా నివసిస్తున్నారు. వారికి గ్రామంలోని సర్వే నంబర్ 78లో 16.91 ఎకరాల విస్తీర్ణంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించారు. ఈ శ్మశాన వాటిక కొన్నేళ్లుగా అభివృద్ధి చేయకపోవడంతో అధ్వానంగా మారింది. దీంతో పాటు ఈ స్థలాన్ని అక్రమించుకున్నారు. అంతిమ సంస్కారానికి వెళ్లే బంధువులు, ప్రజలు నడిచేందుకు సైతం సరైన దారి లేదు. అతికష్టంతో అక్కడకు వెళితే కోడి వ్యర్థాల మూటలు దర్శనమిస్తున్నాయి. దహన సంస్కారానికి పట్టే సమయం రెండు గంటలు ఆ దుర్గంధాన్ని భరించాల్సి వస్తుంది. ఇదే తరుణంలో శ్మశాన వాటిక పక్కనే వ్యవసాయ క్షేత్రాలుండగా నిత్యం ఇదే దారి నుంచి రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. వారు నిత్యం నరక యాతనను అనుభవిస్తున్నారు.

కనీస అవసరాలు, నీరు కరువు

భీమడోలు శ్మశాన వాటిక సమస్యల వలయంగా మారింది. అక్కడ నీరు లేదు. దారి లేక, మాంసపు వ్యాపారులు వదిలి వెళ్లే చర్మాలతో నిత్యం అటుగా వెళ్లే రైతులు, ప్రజలు నానా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అంతిమ సంస్కారాలకు మృతదేహం వెంట వచ్చే ప్రతి ఒక్కరూ పూర్తి కాగానే స్నానాలు ఆచరించడం సంప్రదాయం. అయితే అక్కడ నీరు కూడా లేకపోవడంతో వారు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. అక్కడ కాళ్లు కడుక్కోవడానికి కనీసం నీరు కూడా లేదు. కొంతమంది అక్కడకు ప్రైవేట్ మంచినీటి ట్యాంకర్ తెచ్చుకొని స్నానాలు చేస్తున్నారు. దీంతో ఈ సమస్య గ్రామంలో ప్రధానంగా మారింది. గత ప్రభుత్వంలో వాటిని అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు చేపట్టినా కార్యరూపం దాల్చలేదు. ఇటీవల పల్లె పల్లెకు పత్సమట్ల కార్యక్రమంలో గ్రామస్తులు భీమడోలు శ్మశాన వాటిక సమస్యపై ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు స్థానికులు ఫిర్యాదు చేశారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయండి



భీమడోలు శ్మశాన వాటికకు మృతదేహాలు తీసుకొని వెళ్లాలంటే భయంగా ఉంది. వాటి వెంట వెళ్లడానికి కష్టంగా ఉంది. దారి లేదు. స్థలం ఆక్రమణలకు గురైంది. అక్కడకు వెళ్లాలంటే ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే. స్నానాలు చేసేందుకు నీరు లేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– మంచెం నాగు, గ్రామస్తుడు, భీమడోలు

సర్వే చేసి ఫెన్సింగ్ వేయిస్తాం



భీమడోలు శ్మశాన వాటిక అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆదేశాల మేరకు శ్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేయిస్తాం. అక్కడ షెడ్డు, మంచినీటి ట్యాంకు నిర్మించేలా అన్ని చర్యలు చేపడతాం. అక్కడ దుర్గంధం రాకుండా నివారణ చర్యలు చేపడతాం. దీర్ఘకాలంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు దృష్టి సారించాం. గ్రామస్తులు ఆందోళన చెందొద్దు.

– కేవీఎల్ తనూజ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ, భీమడోలు

ఆపదలో అండగా వైఎస్సార్ సీపీ



రామ్మోహన్‌రావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

పెదవేగి: ఆపదలో అండగా ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానని వైఎస్సార్ సీపీ నేత చల్లగొళ్ల ప్రదీప్ అన్నారు. పెదవేగి మండలం, పెదవేగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త దాసరి రామ్మోహన్ రావు ఇటీవల తన ఎడమ కాలు విరగగా ఏలూరు లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్ లో ఆపరేషన్ చేయించుకొని డిశ్చార్జ్ అయి ఇంటికి రాగా పెదవేగి గ్రామనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పొన్నూరు శంకర్, అద్దేపల్లి కట్టయ్య, గారపాటి రమేష్, తాతా మణి కుమార్, ఇతర కార్యకర్తలతో కలిసి, చల్లగొళ్ళ ప్రదీప్ కుమార్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందించారు. దాసరి రామ్మోహన్‌రావు, కుటుంబ సభ్యులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొల్లేరు పరిరక్షణకు కృషి చేయాలి

దెందులూరు: ఏలూరు మండలంలో గ్రామ గ్రామాన గృహ నిర్మాణం, కొల్లేరులో తనిఖీ తొలి ప్రాధాన్యత కావాలని తహసీలార్ద్ జి.విజయ కుమార్ రాజు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం గ్రామాలు వారీగా వీఆర్ఓలతో సమీక్షించారు. నిబంధనలకు విరుద్ధంగా కొల్లేరులో తవ్వకాలను అడ్డుకోవాలన్నారు. కొల్లేరు పరిరక్షణకు కృషి చేయాలని ఆదేశించారు. నీటితీరువా పనులు వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, వీఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

పేరాయికుంట చెరువు ఆక్రమణలు తొలగించాలి

- డంపింగ్‌యార్డ్‌ను వేరే ప్రదేశానికి తరలించాలి
- మైనర్ ఇరిగేషన్ చెరువులకు నీరందించి రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదును అందజేస్తున్న మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్రప్రసాద్

భీమడోలు: పొలసానిపల్లిలోని పేరాయికుంట చెరువును సర్వే చేసి అక్రమణలు తొలగించాలని, చెర్వును కలుషితం చేస్తున్న డంపింగ్ యార్డ్‌ను అక్కడ నుంచి వేరే ప్రదేశానికి మార్చాలని కోరుతూ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆ గ్రామ మాజీ ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ ఆర్‌టీఐ నియోజకవర్గ సెల్ కన్వీనర్ అంబటి నాగేంద్రప్రసాద్ ఫిర్యాదు చేశారు. భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవికి ఆయన పలు సమస్యలను లిఖితపూర్వకంగా అందజేశారు. గ్రామంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పేరాయికుంట చెరువు గ్రామం మధ్యలో ఉండడం వలన మంచినీటి చెరువుగా గ్రామస్తులు తాగునీటి అవసరాలను తీర్చేదన్నారు. అయితే చెరువును రానురాను ఆక్రమించుకోవడంతో పాటు మురికి కూపంగా మార్చేసారని, ఈ చెర్వును సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఊరికి మధ్యలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ వలన పక్కనే ఉన్న పేరాయికుంట చెరువు కలుషితమవుతుందన్నారు. దీని వలన ఆ యార్డ్ పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డంపింగ్ యార్డ్‌ను వేరే ప్రదేశానికి మార్చాలని, చెరువు చుట్టూ పటిష్టమైన గట్టు వేసి సంరక్షించాలని ఆయన కోరారు. అదే విధంగా పోలవరం కాల్వ నీటిని లిఫ్టులతో గాని పైపులా ద్వారా గ్రామంలోని ఇరిగేషన్ చెర్వులకు నీటిని అందించి రైతులను ఆందుకోవాలని ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ ఏడాది సరైన వర్షాలు లేక ఇరిగేషన్ చెర్వుల్లో నీరు లేక సార్వా పంట పండించుకునే రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. సన్నచిన్న కారు రైతులు ఈ నీటినే ఆధారపడి సాగు చేసేవారన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ ప్రాంతానికి కాల్వ ద్వారా చెరువులోకి నీటిని విడుదల చేసేలా తమ వంతు సహాయ సహకారాలను అందించాలని ఆయన కోరారు.

నిర్వాసిత ఆదివాసీలకు భూమి చూపించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

కుక్కునూరు: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంతో సర్వం కోల్పోతున్న నిర్వాసిత ఆదివాసీ గిరిజనులకు ఇచ్చే భూమికి భూమి పరిహారాన్ని ఇంత వరకు చూయించలేదని ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతూ సోమవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కుక్కునూరు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరం సంజీవరావు మాట్లాడుతూ పోలవరం భూసేకరణ చేసి ఏడేళ్లు కావస్తున్నా ఇంత వరకు ఆదివాసీ నిర్వాసితులకు ఇస్తామన్న భూమికి భూమి పరిహారం భూములను ఆదివాసీలకు ఇవ్వలేదని విమర్శించారు. ఆదివాసీలకు న్యాయం చేయలేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు పైదా బొర్రయ్య, పైదా చిన్నబాబు, కూరం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజులు విద్యుత్ సరఫరా నిలుపుదల

దెందులూరు: మండలంలో మంగళవారం, బుధవారం సత్యనారాయణపురం, దెందులూరు, అలుగులగూడెం, కొమరేపల్లి, గంగన్నగూడెం, కొత్తగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఈ గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

పెదవేగిలో..

పెదవేగి: మండలంలోని పెదవేగి సెక్షన్ పరిధిలో పెదవేగి నుంచి వెళ్లే రామసింగవరం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో నూతన లైన్ నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 29వ తేదీ మంగళవారం, 30వ తేదీ బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. కావున రామసింగవరం పరిధిలో గల వ్యవసాయ బోరు బావులకు విద్యుత్‌ను ముందుగా అంటే తెల్లవారు జామున 3 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు విడతలుగా రైతులకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. రైతులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. గృహ వినియోగదారులకు ఎటువంటి అంతరాయం కలగదని, కూచింపూడి సబ్ స్టేషన్ నుంచి మైల్ ఎనర్జీ ఫీడర్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

పింఛన్.. టెన్షన్



రెండో సారి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న మాణిక్యాలరావు

పెదవేగి: వినికిడి లోపంతో బాధపడుతున్న తన కు పలుమార్లు వైద్య పరీక్షల పేరుతో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితుడు తాతా మాణిక్యాలరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో టెస్ట్ చేసి పింఛన్ ఇస్తున్న పెదవేగి వెల్ఫేర్ అసిస్టెంట్, ఎంపీడీఓ రాజకీయ కారణాలతో మరలా తిరిగి టెస్టుకు వెళ్లమని వేధిస్తున్నారని, వెళ్లకపోతే పింఛన్ కట్ అవుతుందని బెదిరించడంతో ఈ ప్రభుత్వంలో ఎన్ని సార్లు టెస్ట్‌కు వెళ్లాలని రెండోసారి ఏలూరు కలక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తున్నానని వాపోయాడు.

ఏవీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో కొత్త కోర్సులు



నూతన కంప్యూటర్ కోర్సులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): పవర్ పేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో సి లాంగ్వేజ్, సి ప్లస్ ప్లస్, జావా, ఒరాకిల్ కోర్సులను ప్రారంభించినట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, విద్యా విభాగం కన్వీనర్ ఆలపాటి నాగేశ్వరరావులు తెలిపారు. కిలారు కల్పన కె.సుధీర్‌లు అందించిన ఐదు కంప్యూటర్లను తరపున స్వీకరించారు. గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ 2019లో ప్రారంభించిన కంప్యూటర్ శిక్షణ కేంద్రం 36 బ్యాచ్‌లు పూర్తి చేసిందన్నారు. ప్రజా ప్రతినిధులు, దాతల విరాళాలతో ఈ కేంద్రం నడుపుతున్నామని తెలిపారు. ఈ కేంద్రానికి గుర్తింపు ఇచ్చిన సెట్ వెల్ విభాగం వారికి ధన్యవాదాలు తెలిపారు. కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో జాయిన్ కావాలనుకునేవారు ఫోన్ నంబర్లు 93978 32527, 94900 98559లో సంప్రదించాలన్నారు. కోర్సుల పి.శ్రీధర్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమానికి కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ ఎమ్మెస్, లక్ష్మి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు, కె.శ్రీనివాస్, డి.నరసింహారావు, కె.జనని, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరంపై అప్రమత్తంగా ఉండాలి



డెంగీ జ్వరాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ద్వారకాతిరుమల: డెంగీ జ్వరం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ద్వారకా తిరుమల పీహెచ్‌సీ పరిధిలోని నారాయణపురం గ్రామంలో వైద్య సిబ్బంది డెంగీ జ్వరాలపై ప్రజలకు సోమవారం అవగాహన కల్పించారు. అందులో పాల్గొన్న గోవిందరావు మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, కండరాలు, కనుగుడ్లు నొప్పులు ఉంటే అది డెంగీ జ్వరం కావొచ్చన్నారు. ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స పొందాలన్నారు. డెంగీకి కారణమైన ఎడీస్ దోమ ఆవాసం ఉండే నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య శాలల్లో ఉచితంగా డెంగీ పరీక్షలు చేస్తారన్నారు. అలాగే ప్రజలు దోమల నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరారు. దోమ కుట్టరాదు, చిన్న కాటు పెద్ద ముప్పు, ఫ్రైడే డ్రై డే ఆచరించాలి అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ శబరిబాబు, రామకృష్ణ, ఆరోగ్య కార్యకర్త స్వరూప, సుజాత, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ గౌరి, ఆశా కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

16న పంచ్ జ్యోతిర్లింగ దర్శన్‌తో అంబేడ్కర్ యాత్ర

ఏలూరు (టూటౌన్): ఐఆర్‌టీసీ ఆధ్వర్యంలో 16న పంచ్ జ్యోతిర్లింగ దర్శన్‌తో అంబేడ్కర్ యాత్రను నిర్వహించనున్నట్టు ఏరియా మేనేజర్ ఎంరాజా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రలో నాగపూర్ అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన దీక్షా భూమి స్తూపం, ఉజ్జయినీ, భీమ్ జన్మభూమి (డాక్టర్ అంబేడ్కర్ జన్మస్థలం), నాసిక్, పూణె, ఔరంగాబాద్ క్షేత్రాలను సందర్శించవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 16న యాత్ర ప్రారంభమై 24 వరకు ఉంటుందని, యాత్ర సికింద్రాబాద్ నుంచి నిజామా బాద్ మీదుగా ఉంటుందని వివరించారు. పెద్దలకు స్లీపర్ క్లాస్ టిక్కెట్ ధర రూ.14,700, థర్డ్ ఏసీ రూ.22,900, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర రూ.29,900, పిల్లలకు (5–11 సంవత్సరాలు) స్లీపర్ టిక్కెట్ ధర రూ.13,700, థర్డ్ ఏసీ టిక్కెట్ ధర రూ.21,700, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర రూ.28,400గా నిర్ణయించారని తెలిపారు. ప్రయాణికులకు ఉదయం టీ, అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం ఉంటుందని తెలిపారు.

ముస్తాబవుతున్న గణనాథులు

- ప్రతిమల తయారీలో రాజస్థానీ కుటుంబాలు
- ఇప్పటికే ఆర్డర్లు, అడ్వాన్సులు చెల్లిస్తున్న ఉత్సవ నిర్వాహకులు



పోతపోసి సిద్ధం చేసిన ప్రతిమలు



ప్రతిమలకు రంగులు అద్దుతున్న రాజస్థానీ యువతి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గణపతి నవరాత్రి మహోత్సవాలు వస్తున్నాయంటే తెలుగు గడ్డపై సందడి వాతావరణం నెలకొంటుంది. ప్రతి పూజలో తొలిపూజ అందుకునే గణపతికి తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఉత్సవ కమిటీల హడావుడి ప్రారంభమైంది. దాదాపు దశాబ్ద కాలానికి పైగా ఏలూరులోని కుండీ సెంటర్, ఎన్ఎస్ కూరగాయల మార్కెట్, రామకోటి ప్రాంగణాల్లో ఒకరిని మించి ఒకరు భారీ ప్రతిమలు ఏర్పాటు చేయడాన్ని నగర ప్రజలు ఆస్వాదిస్తున్నారు. ఈ ఏడాది కూడా అందుకు మినహాయింపు ఉండదనే ఆయా ఉత్సవ నిర్వాహకులు చెబుతున్నారు.

ఉత్సవ కమిటీల బిజీబిజీ

నగరంలో గణపతి నవరాత్రి మహోత్సవాలు వస్తున్నాయంటేనే పండుగ వాతావరణం ప్రారంభమవుతుంది. గతంలో పేటకి ఒక పందిరి వేసి ఉత్సవాలు నిర్వహించే వారు. ఈ మధ్య కాలంలో పోటీ మరింత పెరిగి ప్రతి పేట, ప్రతి వీధిలోనూ పందిళ్లు వేసి ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పందిళ్లలో ఏర్పాటు చేయడానికి మంచి ఆకృతిలో ఉన్న ప్రతిమలను ఎంపిక చేసుకునే పనిలో ఉత్సవ కమిటీల ప్రతినిధులు బిజీగా ఉన్నారు.

ఇప్పటికే ఆర్డర్లు, అడ్వాన్సుల చెల్లింపు

ఉత్సవ కమిటీల ప్రతినిధులు వినాయక ప్రతిమల తయారీదారులకు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. వారి తో తక్కువ ధరకే ప్రతిమలు తయారీ చేయడానికి తయారీదారులు ఒప్పందం చేసుకుంటున్నారు. ఏలూరు నగరంలోని 50 డివిజన్లలో సుమారు 250 ప్రతిమలు ఏర్పాటు చేయనున్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి ప్రతిమలనే వినియోగించాలని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నప్పటికీ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన ప్రతిమలు ఆకర్షణీయంగా ఉండడంతో వాటినే తమ పందిళ్లలో ప్రతిష్ఠించేందుకు మొగ్గుచూపుతున్నారు.

ప్రతిమల తయారీ.. వారి జీవనాధారం

దాదాపు నాలుగు దశాబ్దాల క్రితమే నగరానికి వచ్చి స్థిరపడిన కొన్ని రాజస్థానీ కుటుంబాలు గణపతి ప్రతిమల తయారీనే వృత్తిగా జీవిస్తున్నాయి. గణపతి నవరాత్రి ఉత్సవాల అనంతరం కూడా వారు ఇతర దేవతామూర్తుల చిన్నచిన్న ప్రతిమలు తయారు చేస్తూ వాటిపై వచ్చే ఆదాయంతో మనుగడ సాగిస్తున్నాయి. గణపతి నవరాత్రి సందర్భంగా వీరు అప్పులు చేసి మరీ దాదాపు రూ.10 లక్షల పెట్టుబడితో ప్రతిమలను తయారు చేస్తున్నారు. దాదాపు రెండు నెలల పాటు ఈ కుటుంబాలు గణపతి ప్రతిమల తయారీ పనిలోనే ఉంటాయి. శివపార్వతులతో కలిసి ఉన్న గణపతి, సిద్ధి, బుద్ధిలతో కలిసి ఉన్న గణపతి, త్రిశూల గణపతి, వేంకటేశ్వర స్వామి ఆకృతిలో గణపతి ఇలా వివిధ ఆకృతుల్లో గణపతి ప్రతిమలు ఉత్సవ నిర్వాహకులకు అందుబాటులో ఉంచుతున్నారు. ఆయా ఆకృతుల్లో వివిధ పరిమాణాల్లో ప్రతిమలను ముస్తాబు చేస్తున్నారు.

ఆర్డర్లు వస్తున్నాయి



ఉత్సవ కమిటీల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి. ప్రతిమల తయారీకి అవసరమైన ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కొబ్బరి పీచు, రంగులు తదితర ముడిసరుకు ధరలు పెరుగుతున్నాయి. దీంతో ప్రతిమల ధరలు కూడా పెరిగే అవకాశం ఉంది. ఇప్పటి వరకు అనుకున్న ధరకు ప్రతిమలు అందించగలమా లేదో అనే భయం వెంటాడుతోంది. అడ్వాన్సులు తీసుకుంటున్నాం. ముందుగా చెప్పిన ధరకే ప్రతిమలను అప్పజెప్పాలి.

– సోలంకి బొమరియా, గణపతి ప్రతిమల తయారీదారు